కొండల్లో.. గుట్టల్లో..!

ఊరికి దూరంగా గుట్టల్లో, కొండల్లో లేఅవుట్లు వేసి పేదలకు పట్టాలిచ్చారు. కేంద్రం ఇచ్చిన నిధుల్ని ఇంటి నిర్మాణానికి ఖర్చు చేశారు. జగనన్న కాలనీ అంటూ ప్రచారం చేసుకున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. లేఅవుట్ల చదును పేరుతో రూ.కోట్ల దోపిడీ జరిగింది. కావాలనే గుట్టల్ని ఎంపిక చేయడం... వాటిని చదును చేయడానికి అంటూ రూ.లక్షలు బిల్లులు చేయడం.. ఆ కాంట్రాక్టునూ వైసీపీ నేతలకే కట్టబెట్టడం.. ఇదీ వైసీపీ పాలనలో జరిగిన ఓ రకమైన దోపిడీ. వైసీపీ హయాంలో ఇచ్చిన యూనిట్ కాస్ట్ సరిపోకపోవడం, నివాసయోగ్యం కాని లేఅవుట్లలో పట్టాలివ్వడంతో లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రాలేదు. జిల్లాలో 75 వేల గృహాలు మంజూరైతే, అందులో సగం నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. ఇకపై పేదల ఇళ్లకు స్థలం నుంచి యూనిట్ కాస్ట్ వరకు 'రెట్టింపు' ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన చేశారు. దీంతో సొంతింటి కల నెరవేరుతుందని పేదలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

\- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



బంగారుపాళ్యం మండలం ఎర్రండ్లపల్లె అటవీప్రాంతంలోని ఈ జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు కట్టుకుని నివాసం ఉండేదెలా?


రూ.16 లక్షలతో చదును చేస్తే ఒక్కరూ ఇల్లు కట్టుకోలేదు


బంగారుపాళ్యం మండలం 170 గొల్లపల్లి పంచాయతీలో ఎర్రండ్లపల్లె అటవీ ప్రాంతంలోని ప్రభుత్వం భూమిలో జగనన్న లేఅవుట్ వేశారు. సుమారు ఒకటిన్నర ఎకరాలో 51మందికి పట్టాలు ఇచ్చారు. ఈ గుట్టను చదును చేయడానికి స్థానిక వైసీపీ నేతకు రూ.16 లక్షల బిల్లు మంజూరు చేశారు. ఏమాత్రం నివాస యోగ్యం కాని ఇక్కడ కనీసం ఒక్కరూ నిర్మాణం ప్రారంభించలేదు. వైసీపీ నేత మాత్రం బిల్లులు చేసుకున్నారు.

- సదుం మండలం ఎర్రాతివారిపల్లె లేఅవుట్‌ను చదును చేసేందుకు కూడా రూ.4 లక్షల వరకు బిల్లులు చేసుకున్నారు. జిల్లాలో చాలాచోట్ల ఇలాగే గుట్టల్ని చదును చేసి వైసీపీ నేతలు రూ.లక్షల్లో బిల్లులు చేసుకున్నారు. నివాస యోగ్యం కాని గుట్టల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు.

ఊళ్లకు దూరంగా...

గుడిపాల మండలంలోని 197 రామాపురం జగనన్న కాలనీలో సుమారు 80 మందికి పట్టాలు ఇచ్చారు. ఈ లేఅవుట్ గ్రామం నుంచి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఇళ్లను కట్టుకోవడానికి లబ్ధిదారులు ముందుకు రాలేదు. దీంతో ఇప్పటికీ ఆ లేఅవుట్ ఖాళీగానే ఉండిపోయింది. జిల్లాలో మొత్తం 500 చిన్న, 30 పెద్ద లేఅవుట్లను వేశారు. వీటిలో ఊళ్లకు దూరంగా, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో సుమారు సగానికి పైగా లేఅవుట్లు ఉన్నాయి. దీంతో ఆయా లేఅవుట్లలోని లబ్ధిదారులు అసంతృప్తిలో ఉన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు కొత్తగా పట్టాలిచ్చేవారికి నివాసానికి అనుగుణంగా గ్రామాలకు దగ్గరగా ఇస్తాననడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





చదును చేసే డబ్బుతో భూమి కొనవచ్చు

రామకుప్పంలోని పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసేందుకు రామకుప్పం- ఆవులకుప్పం మధ్యనున్న పిల్లిగుట్టల్ని చదును చేశారు. నియోజకవర్గ స్థాయిలో కీలకమైన నామినేటెడ్ పదవి చేపట్టిన ఓ వైసీపీ నేతకు కాంట్రాక్టు ఇచ్చి రూ.30 లక్షల బిల్లును చెల్లించారు. ఆయనకు ఇచ్చిన రూ.30 లక్షలతో మండల కేంద్రానికి సమీపంలోనే 3 ఎకరాలు కొనుగోలు చేసి పేదలకు ఇచ్చే అవకాశం ఉంది. అయినా అధికారులు వైసీపీ నేతకు కొమ్ము కాశారు.

• జగనన్న లేఅవుట్లు

- చదును పేరిట వైసీపీ నేతల దోపిడీ
- అనువుగానిచోట ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారుల అనాసక్తి
- తాజాగా 'రెట్టింపు' ప్రయోజనంతో సీఎం చంద్రబాబు ఇళ్ల ప్రకటనపై పేదల ఆనందం

ఇక స్థలం, యూనిట్ కాస్ట్ 'రెట్టింపు'

జగనన్న లేఅవుట్‌లో ఇల్లు కట్టుకున్న లబ్ధిదారులంతా ఇప్పుడు బాధపడుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇల్లు కట్టుకుని ఉంటే బాగుండేదని పలువురు అంటున్నారు. ఇంకా ఇల్లు కట్టుకోని వాళ్లేమో సంతోషంతో ఉన్నారు. పేదలకు సొంతింటి కలను నెరవేర్చడానికి సీఎం చంద్రబాబు తాజాగా చేసిన ప్రకటనే దీనికి కారణం. జగనన్న లేఅవుట్లలో గ్రామాల్లో ఒకటిన్నర, పట్టణాల్లో ఒక సెంటు చొప్పున ఇచ్చారు. దీనిని గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున స్థలం ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. అంటే, వైసీపీ అందించిన దానికంటే రెట్టింపు అన్నమాట. ఇక, ఇంటి నిర్మాణానికి ఏకంగా రూ.4 లక్షలు అందిస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం యూనిట్ కాస్ట్ పెంచుతుందని భావించినా.. రూ.4 లక్షలకు పెంచుతుందని ఎవరూ అనుకోలేదు. వైసీపీ హయాంలో ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షలు యూనిట్ కాస్ట్ ఉండేది. దాన్ని కూడా కేంద్రమే ఇచ్చేది. దీంతో పాటు మరుగుదొడ్డి నిర్మాణానికి మరో రూ.30 వేలు ఉపాధిహామీ నిధుల్ని కేంద్రమే ఇచ్చేది. అంటే రాష్ట్ర ప్రభుత్వ వాటా నయాపైసా లేదు. ఇప్పుడు కేంద్ర, రాష్ట్రాల వాటాల విషయంలో క్లారిటీ లేదు. ఈ మధ్య కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్తగా 3 కోట్ల ఇళ్ల నిర్మాణం చేస్తామని ప్రకటించారే తప్ప.. యూనిట్ కాస్ట్ గురించి చెప్పలేదు. కేంద్రం ఎంత ఇచ్చినా లబ్ధిదారుడికి మాత్రం రూ.4 లక్షలు అందుతుందని సీఎం చంద్రబాబు చెప్పడంతో కొత్త లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో, వైసీపీ హయాంలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న వాళ్లేమో ఇప్పుడైతే భూమి, డబ్బు ఎక్కువగా వచ్చేదని ఆవేదన చెందుతున్నారు. కాగా, ఇప్పుడు జిల్లాలో సుమారు 20 వేల మందికి పైగా అర్హులు ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేసుకుని ఉన్నారు. వీరందరికీ కూటమి ప్రభుత్వం అందించే 'రెట్టింపు' ప్రయోజనం అందనుంది.



పెండింగు బిల్లులు ఇస్తామనడం సంతోషం

మా ఇంటి నిర్మాణం పూర్తయినా.. ఇప్పటివరకు మాకు పునాది బిల్లు మాత్రమే మంజూరైంది. ప్రభుత్వం మారడంతో పాత లబ్ధిదారులైన మాకు బిల్లులు వస్తాయో రావో అని ఇన్నాళ్లు ఆందోళనలో ఉన్నాం. సీఎం చంద్రబాబు పాత లబ్ధిదారులకు కూడా పెండింగు బిల్లులు మంజూరు చేస్తామని చెప్పడంతో ప్రశాంతంగా ఉన్నాం.

\- శ్యామల, భీమిగానిపల్లె, పుంగనూరు మండలం



ఇప్పుడు నిర్మించుకుని ఉంటే బాగుండేది

జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకునేందుకు సుమారు రూ.7 లక్షలు ఖర్చయింది. ప్రభుత్వం ఇచ్చింది కాకుండా రూ.5 లక్షలు అప్పు చేశాను. ఆ అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదు. ఇప్పుడు సీఎం చంద్రబాబు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తానంటున్నారు. ఇప్పుడు కట్టుకుని ఉంటే బాగుండేదనిపిస్తోంది.

\- గన్నా చెన్నకేశవులు, సోమల.

• ఛలో అమరావతి

బాబును చూద్దాం.. టీడీపీలో చేరుదాం!

కుప్పంనుంచి వైసీపీ ఎంపీటీసీలు, కౌన్సిలర్ల రాజధాని పయనం

నేడో రేపో పార్టీలో చేరిక

కుప్పంలో వైసీపీ ఖాళీ అవుతోంది. వైసీపీనుంచి టీడీపీలోకి పెద్దయెత్తున చేరికలు ఉండబోతున్నాయని నెల రోజులుగా వినిపిస్తున్న వార్తలకు మంగళవారం సాయంత్రానికి ఒక పునాది దొరికింది. కుప్పంలోని మూడు మండలాలనుంచి మొత్తం 15 మంది వైసీపీ ఎంపీటీసీలు, నలుగురు కౌన్సిలర్లు విజయవాడ బయలుదేరి వెళ్లారు. వీరంతా నేడో, రేపో టీడీపీలో చేరనున్నారు. మిగిలిన వైసీపీ ఎంపీటీసీలు, కౌన్సిలర్లు కూడా అధికార పార్టీలో చేరడానికి ఉవ్విళ్లూరుతున్నారు.

\- కుప్పం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ జులుం ప్రదర్శించింది. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి, పంచాయతీలను ఏకగ్రీవం చేయించుకున్నారు. ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా ఇదే జరిగింది. వైసీపీ అధికార దుర్వినియోగానికి నిరసనగా మండల పరిషత్తు ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయలేదు. దీంతో నియోజకవర్గం వైసీపీకి ఏకపక్షమైంది. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చింది. కుప్పంలో టీడీపీని నామరూపాలు లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికేవారు. ఒకరిద్దరు పోలీసు అధికారులు కూడా బహిరంగంగానే ఈ డైలాగ్ వాడుతుండేవారు. కానీ అది జరగలేదు. అధికార పార్టీ అక్రమాలు, అరాచకాలతో భయపడి నిద్రాణంగా ఉన్న టీడీపీ, ప్రజల మనసులను గెలుచుకుని మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పునరుత్తేజం చెందింది. ఇప్పుడు టీడీపీ వంతు వచ్చింది. వైసీపీనుంచి చేరికలకు అధిష్ఠానం తెరతీసింది. నిజానికి కుప్పం నియోజకవర్గంలో అంతర్భాగమైన మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ చేరికతో ఆ ప్రక్రియ మొదలయ్యేదే. కానీ అతికొద్దిమంది నాయకులు అడ్డుకోవడంతో అది ఆలస్యమైంది. కానీ ఎన్నికల సమయంలో ఉపయోగపడని సదరు నాయకులను అధిష్ఠానం ఏమాత్రం పట్టించుకోలేదు. ఇప్పుడు చేరికలను వేగవంతం చేయడానికి తెరవెనుక మంత్రాంగం నడిపించింది. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ నేతృత్వంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చేరికలకు ప్రత్యేకంగా ఇన్‌చార్జిలను అంతర్గతంగా నియమించి ప్రయత్నాలు ప్రారంభించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వైసీపీ ఎంపీటీసీలు, కౌన్సిలర్లు సై అంటే సై అన్నారు.

విజయవాడకు పయనం

- కుప్పం మున్సిపాలిటీలో మొత్తం 25 మంది కౌన్సిలర్లుండగా వారిలో 19 మంది వైసీపీవారే. మున్సిపాలిటీని ఆ పార్టీయే గెలుచుకుంది. దాడులు, దౌర్జన్యాలు జరిగాయి, అది వేరే విషయం. ఇప్పుడు ఈ 19 మంది కౌన్సిలర్లలో నలుగురు మంగళవారం సాయంత్రం విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఇంకా ఇద్దరు కౌన్సిలర్లతో మంతనాలు సాగుతున్నాయి. వారు పార్టీలోకి రాననడం లేదు కానీ, ఏవో సమస్యలున్నాయని చెబుతున్నారు. టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ నేతృత్వంలో ఈ చేరికలు జరుగుతున్నాయి.
- కుప్పం మండలంలో 21 మంది ఎంపీటీసీలకు గాను ప్రస్తుతం టీడీపీకి ఇద్దరే ఉన్నారు. వైసీపీ ఎంపీటీసీలలో ముగ్గురు సాయంత్రమే విజయవాడ బయలుదేరారు. టీడీపీనుంచి ఎంపీపీ అభ్యర్థిగా ప్రకటించిన స్వాతి రాజగోపాల్ నేతృత్వంలో వీరు వెళ్లారు. ఇంకా ముగ్గురు ఎంపీటీసీలు కూడా చేరికలకు అంగీకరించారు కానీ, ఏవో సమస్యల కారణంగా ఆగిపోయారు. వీరి చేరిక కూడా కాస్త వెనుకా ముందూ జరుగుతుంది.
- శాంతిపురం మండలం తీసుకుంటే ఇక్కడ మొత్తం 18 మంది ఎంపీటీసీలుండగా సి.బండపల్లెకు చెందిన నామాలప్ప మాత్రమే టీడీపీ ఎంపీటీసీ. మిగిలిన 17 వైసీపీ ఎంపీటీసీలలో ఆరుగురు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు ఆధ్వర్యంలో విజయవాడ బయలుదేరారు.
- గుడుపల్లె మండలంలో 13 మంది ఎంపీటీసీలుండగా వారంతా వైసీపీకి చెందినవారే. వీరిలో ఒక్క ఎంపీటీసీ మాత్రం ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. మిగిలిన 12 మంది ఎంపీటీసీలలో ఆరుగురు మండల టీడీపీ అధ్యక్షుడు బాబునాయుడు ఆధ్వర్యంలో విజయవాడ బయలుదేరారు. ఇంకా ఇద్దరు ఎంపీటీసీలు వేరే పనులమీద వెళ్లి అక్కడే ఉన్నట్లు సమాచారం.
- రామకుప్పం మండలంనుంచి మాత్రం మంగళవారం ఎవరూ విజయవాడ వెళ్లలేదు. 16 మంది ఎంపీటీసీలుండగా అందులో ఒకరైన ఎంపీపీ మృతి చెందారు. మిగిలిన 15 మంది ఎంపీటీసీలలో ఆరేడుమంది ఎంపీటీసీలు ప్రత్యేకంగా రెండుమూడు రోజుల తర్వాత టీడీపీలో చేరడానికి విజయవాడ బయలుదేరి వెళ్లనున్నట్లు తెలిసింది. బుధవారం లేదంటే గురువారంనాడు చంద్రబాబునాయుడు సమక్షంలో ఏకమొత్తంగా టీడీపీలో చేరనున్నారు.



కుప్పంలో నాలుగు రోజుల కిందటే ఖాళీ అయిన వైసీపీ కార్యాలయం

రెండో విడతలో మరిన్ని చేరికలు

వైసీపీనుంచి టీడీపీలో చేరికలు ఇక్కడితో ఆగేలా లేవు. రెండో విడతలో మరిన్ని జరగడానికి ఆస్కారం ఉంది. టీడీపీలో చేరడానికి తొలుత ప్రయత్నించి ఒకరిద్దరు నేతల కినుకతో వెనుకబడిన మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్‌తోపాటు, నాలుగు మండలాల జడ్పీటీసీల చేరికకు కూడా ఇప్పటికే రంగం సిద్ధమైనట్లు తెలిసింది. సర్పంచుల చేరిక కూడా వారితో కలిపో లేక విడిగానో జరగనున్నాయని పార్టీ వర్గాల సమాచారం. ముందుగా కిందిస్థాయిలో చేరికలను ప్రోత్సహించి మండల పరిషత్తులను హస్తగతం చేసుకున్న తర్వాత, మున్సిపాలిటీపైన, జడ్పీటీసీ పదవులపైనా దృష్టి సారించడానికి ఇప్పటికే అధిష్ఠానం సిద్ధం చేసింది. టీడీపీలో ఒకరిద్దరు నాయకులనుంచి కొంతమంది కార్యకర్తలనుంచి వస్తున్న వ్యతిరేకతను తగ్గించడానికి అంచెలంచెలుగా చేరికలను జరుపనున్నారు. ఈ చేరికల వల్ల పార్టీకి కానీ, ఎన్నికల్లో కష్టపడ్డ కార్యకర్తలకు కానీ ఎటువంటి నష్టం, అన్యాయం జరగకుండా చూస్తామని ఇప్పటికే పార్టీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. మొన్న నారా భువనేశ్వరి కుప్పం పర్యటనలోనూ ఇదేరకమైన హామీ ఇచ్చారు. సొంత నియోజకవర్గమైన కుప్పంలో ప్రతిపక్ష పార్టీని ఖాళీ చేయించాలన్న ఏకైక లక్ష్యంతో టీడీపీ అధిష్ఠానం జాగ్రత్తగా వ్యూహం రచించి అమలు చేస్తోంది.



నేడు.. భవనాన్ని కూల్చి ఇతర అవసరాలకు వాడుకునేలా పనులు చేపట్టిన యజమాని

మేమూ బాధితులమే

• డాయ్ యాప్ మోసంపై ఆర్పీలు

పలమనేరు, జూలై 30: 'డాయ్ యాప్' మోసంలో తామూ బాధితులమేనని పలువురు ఆర్పీలు తెలిపారు. తొలిరోజు నుంచీ కొందరు తమపై నిరాధార ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. పలమనేరులోని మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కొందరు ఆర్పీలు తమ ఆవేదన వ్యక్తంచేశారు. తమతో పాటు దశాబ్దకాలంగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి రాజేష్, సీవో జయంతి ఒత్తిడి వల్ల తామూ డాయ్‌యాప్‌లో పెట్టుబడి పెట్టామన్నారు. 'నాకు సెల్‌ఫోనులో ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం తెలియదు. దీంతో రాజేష్ నా ఫోను తీసుకొని ఆయనే డాయ్‌యాప్‌లో నన్ను చేర్పించారు' అని ఒక ఆర్పీ పేర్కొన్నారు. తాము చెప్పినంతం మాత్రాన పలువురు డాయ్‌యాప్‌లో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని చెప్పడం దారుణమని ఇంకొందరు ఆర్పీలు తెలిపారు. 15వేలు కట్టిన వాళ్లు కూడా తాము లక్షలాది రూపాయలు ఆర్పీలను నమ్మి కట్టామని చెబుతున్నారని, వీరంతా గ్రూపుల్లో తీసుకొన్న రుణాలను ఎగవేసేందుకే ఇటువంటి నిరాధారమైన ఆరోపణలు తమపై చేస్తున్నారని పేర్కొన్నారు. తాము వితంతువులమని, తమ పిల్లలను చదివించుకొనేందుకు డాయ్‌యాప్‌లో డబ్బులు వస్తుందని రాజేష్ చెప్పడంతో ఆశపడి తామూ డబ్బులు కట్టామన్నారు. అంతేగానీ ఎవరినీ బలవంతం చేసి డబ్బులు కట్టించలేదన్నారు. ఈ యాప్‌లో ఒక గొలుసులాగా ఒకరు కడితే సభ్యులుగా మారిన వారు మరో పదిమంది చేత కట్టించుకు పోతారని అందరికి తాము ఎలా బాధ్యత వహిస్తామని కన్నీటి పర్యంతమయ్యారు. తమ బ్యాంకు ఖాతాలను కూడా పరిశీలిస్తే తాము ఏమేరకు నష్టపోయామో తెలుస్తుందన్నారు. రాజేష్, సీవో జయంతి మాటలు నమ్మి తాము మోసపోయామన్నారు. ఇప్పుడు రాజేష్ అడ్రస్‌లేకుండా పోయాడని, తమను ఇలా వీధుల్లో వేశాడని శాపాలు పెట్టారు. ఈ డాయ్ యాప్‌లో తమనూ బాధితులుగా గుర్తించాలని ఆర్పీలు తెలిపారు.



రెండో రోజూ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

రెండో రోజు 149 మంది ఫిర్యాదు

రెండో రోజైన మంగళవారం డాయ్‌యాప్ బాధితుల నుంచి సీఐ చంద్రశేఖర్, మెప్మా పీడీ రాధమ్మ ఫిర్యాదులు స్వీకరించారు. సోమవారం 224 మంది రూ. 4.06 కోట్లమేర నష్టపోయినట్టు ఫిర్యాదు చేయగా మంగళవారం 149 మంది రూ.1.99 కోట్ల మేర డాయ్‌యాప్‌లో నష్టపోయినట్లు ఫిర్యాదులు చేశారు. మొత్తం రెండురోజులు మున్సిపల్ కార్యాలయంలో 363 మంది బాధితులు ఫిర్యాదులు చేశారు. వీటిపై నివేదిక తయారు చేసి కలెక్టరుకు పంపనున్నట్లు తెలిసింది.

వీఆర్‌కు పెనుమూరు ఎస్‌ఐ

పెనుమూరు, జూలై 30: పెనుమూరు ఎస్‌ఐ లోకేశ్‌ను వీఆర్‌కు పంపిస్తూ ఎస్పీ మణికంఠ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా వీఆర్‌లో ఉన్న ఆయన్ను పెనుమూరుకు బదిలీ చేశారు. ఇటీవల పెనుమూరు పోలీసు స్టేషన్‌ను ఎస్పీ అకస్మికంగా తనిఖీ చేశారు. ఫిర్యాదులు ఎక్కువ రావడంతోనే ఈ తనిఖీలు నిర్వహించారని, అందులో భాగంగానే ఇప్పుడు వీఆర్‌కు పంపారనే చర్చ జరుగుతోంది.



కుప్పం డీఎస్పీ బదిలీ

కుప్పం, జూలై 30: కుప్పం డీఎస్పీ బి.శ్రీనాథ్ ఇంటెలిజెన్స్ డీఎస్పీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ ఇచ్చిన స్థలంలో రిపోర్టు చేయడానికి డీఎస్పీ శ్రీనాథ్‌ను వెంటనే ప్రస్తుత విధుల నుంచి రిలీవ్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంపికకు నోటిఫికేషన్

చిత్తూరు (సెంట్రల్), జూలై 30: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కార్యదర్శి ఎంపికకు డీఈవో దేవరాజు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. రెండేళ్ల(2024-26) పదవీ కాలానికి ఉపాధ్యాయురాలిని ఎంపిక చేయాల్సి ఉంది. ఆసక్తి, అర్హత కలిగిన సీనియర్ స్కూల్ అసిస్టెంట్ (పీడీ) మహిళా ఉపాధ్యాయులు బుధవారంలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



- పాత, ఇతర ప్రాంత కేసులు కలిపి 3848మంది ఆచూకీ లభ్యం
- బాలికలు, యువతులు, మహిళల అదృశ్యంపై లోక్‌సభలో హోం శాఖ సహాయ మంత్రి వెల్లడి

తిరుపతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బాలికలు, యువతులు పెద్ద సంఖ్యలో అదృశ్యమవుతున్నారంటూ ఇదివరకూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలు ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే. రాష్ట్రం పరువు ప్రతిష్టలు దెబ్బ తీసేందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ అప్పట్లో వైసీపీ వర్గాలు ఆయనపై విరుచుకుపడ్డాయి. అయితే తాజాగా మంగళవారం సాక్షాత్తూ లోక్‌సభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి వెల్లడించిన వివరాలు గత వైసీపీ పాలకులకు చెంపపెట్టుగా పరిణమించింది. ఏపీ మొత్తం సంగతి పక్కన పెట్టి ఒక్క తిరుపతి జిల్లా వరకే చూస్తే గడచిన ఐదేళ్ళలో ఏకంగా 3746 మంది బాలికలు, యువతులు, మహిళలు అదృశ్యమయ్యారు.అదే సమయంలో ఈ ఐదేళ్ళ వ్యవధిలో పోలీసు యంత్రాంగం 3848 మంది ఆచూకీని కనుక్కోగలిగింది. 2019కి ముందు అదృశ్యమైన వారి, అలాగే ఇతర ప్రాంతాల్లో అదృశ్యమైన వారి ఆచూకీ జిల్లాలో లభించడం వల్ల అదృశ్యమైన వారి సంఖ్య కంటే ఆచూకీ దొరికిన వారి సంఖ్య స్వల్పంగా ఎక్కువగా కనిపిస్తోంది.

2019లో 579 మంది అదృశ్యం

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 2019లో 18 ఏళ్ళలోపు బాలికలు 219మంది అదృశ్యమయ్యారు. అదే ఏడాది 240మంది ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. 18 ఏళ్ళు ఆపై వయసున్న యువతులు, మహిళలు 360 మంది అదృశ్యం కాగా 347మంది ఆచూకీ తెలిసింది.ఈ రెండు కేటగిరీల్లో ఆ ఏడాది 579మంది అదృశ్యమైనట్టు ఫిర్యాదులు అందగా 587మంది ఆచూకీని పోలీసులు కనుగొన్నారు.

2020లో 931మంది గల్లంతు

2020లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 18ఏళ్ళ లోపు బాలికలు 349మంది అదృశ్యమైతే ఆ ఏడాదిలో 347మంది ఆచూకీ తెలిసింది. 18ఏళ్ళ యువతులు, అంతకు పైబడిన వయసు కలిగిన మహిళలు 582మంది ఆచూకీ గల్లంతు కాగా 605మంది ఆచూకీని కనుగొన్నారు. ఆ ఏడాది బాలికలు, యువతులు, మహిళలూ కలిపి 931మంది అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదులందితే 952మందిని ట్రేస్ చేయగలిగారు.

2021లో 1085మంది మాయం

2021లో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 412మంది బాలికలు కనిపించకుండా పోగా ఆ ఏడాదిలో 428మంది బాలికల ఆచూకీని కనిపెట్టగలిగారు. అలాగే 673మంది యువతులు, మహిళలు గల్లంతు కాగా 717మంది ఆచూకీ వెల్లడైంది. ఆ ఏడాది మొత్తంగా 1085మంది బాలికలు, యువతులు, మహిళలు కనిపించకుండా పోగా 1145మంది ఆచూకీ తెలిసింది.

2022లో కనిపించకుండా పోయిన 615మంది

2022లో కొత్త జిల్లాల ప్రాతిపదికన తిరుపతి జిల్లాలో 217మంది బాలికలు గల్లంతు కాగా 211మంది ఆచూకీ కనిపెట్టారు.398మంది యువతులు,మహిళలు కనిపించకుండా పోగా 425మంది ఆచూకీ తెలిసింది. ఆ ఏడాది మొత్తంగా 615మంది అదృశ్యమైతే 636మంది ఆచూకీని కనిపెట్టారు.

2023లో 536మంది మిస్సింగ్

2023లో 192మంది బాలికలు అదృశ్యం కాగా 194మంది ఆచూకీ తెలిసింది. 344మంది యువతులు, మహిళలు గల్లంతు కాగా 324మంది ట్రేస్ అయ్యారు. మొత్తం 536మంది కనిపించకుండా పోగా 518 మందిని కనిపెట్టారు.

ఐదేళ్ళలో 3746మంది అదృశ్యంపై ఫిర్యాదులు

గడచిన ఐదేళ్ళలో జిల్లానుంచీ 3746మంది కనిపించకుండా పోయారని పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఇందులో కేటగిరీ వారీగా చూస్తే 1389మంది బాలికలు గల్లంతు కాగా అదే కేటగిరీలో 1420మంది ఆచూకీ తెలిసింది. అలాగే 2357మంది యువతులు, మహిళలు ఆచూకీ తెలియలేదని ఫిర్యాదులందగా ఆ ఏడాదిలోనే 2418మంది ఆచూకీ తెలిసింది. మొత్తంగా ఐదేళ్ళలో ఈ రెండు కేటగిరీలూ కలిపి 3746మంది అదృశ్యం కాగా 3848మంది ఆచూకీ తెలిసింది. మంగళవారం లోక్‌సభలో టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, బీకే పార్థసారథి దీనిపై లిఖితపూర్వక ప్రశ్నలు వేయగా కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పై వివరాలు వెల్లడించారు.

ఈవీఎం గోదాము తనిఖీ



తనిఖీ అనంతరం రిజిస్టర్లో సంతకం చేస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 30: ఈవీఎం, వీవీప్యాట్లకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును మంగళవారం కలెక్టర్, డీఆర్వో పుల్లయ్యతో కలసి పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా, ప్రతి మూడునెలలకోసారి ఈవీఎం, వీవీప్యాట్ గోదాములు తనిఖీ చేసి, సమగ్ర నివేదికను ఈసీఐకి పంపిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అట్లూరి శ్రీనివాసులు, గంగరాజు, ఉదయ్, భాస్కర్, ఎన్నికల విభాగ అధికారి ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో తేలికపాటి వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 30: జిల్లాలోని 17 మండలాల్లో గడచిన 24 గంటల్లో మాదిరి నుంచి తేలికపాటి వర్షాలు కురిశాయి. మండలాలవారీగా నగరిలో 35.2, వెదురుకుప్పంలో 24.2, నింద్రలో 19.4, కార్వేటినగరంలో 16.8, విజయపురంలో 12.6. రొంపిచెర్లలో 7.8, సదుంలో 5.2, గంగాధరనెల్లూరులో 5.2, పులిచెర్లలో 5.0 తవణంపల్లెలో 4.8, ఐరాలలో 3.2, చిత్తూరు రూరల్‌లో 3.2, శ్రీరంగరాజపురంలో 2.8, గుడుపల్లిలో 2.6, పూతలపట్టులో 2.2, చిత్తూరులో 1.0, పెనుమూరులో 0.4 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

వేము కళాశాలలో నూతన కోర్సులు



ప్రిన్సిపాల్ నవీన్


చంద్రగిరి, జూలై 30 : పూతలపట్టు మండలం, పి.కొత్తకోట సమీపంలోని వేము ఇంజనీరింగ్ కళాశాలలో బీబీఏ, బీసీఏ కోర్సుల్లో నూతన కోర్సులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్ కిలారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీబీఏలో బిజినెస్ అనలిటిక్, బీసీఏలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచే అటానమస్ ప్రోగ్రామ్‌గా నిర్వహించడం చిత్తూరు జిల్లాలో ప్రప్రథమం అని తెలిపారు. ఈ కోర్సులను పూర్తిగా ఉద్యోగ శిక్షణకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దామన్నారు. అంతేకాకుండా ఈ కోర్సులకు స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ విత్ ఐబీఎస్, బెంగళూరు అన్నారు.ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఉద్యోగ సముపార్జనకు కావాల్సిన పూర్తి మెలకువలను నేర్పడానికి, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీంతో పాటు విద్యార్థులకు పరీక్ష ఫలితాలను 15 రోజుల్లోనే ప్రకటిస్తామని తెలిపారు.

ఫ్యాన్లు చోరీ చేసిన ముఠా అరెస్టు



శ్రీరంగరాజపురం, జూలై 30: ఆరిమాకుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఫ్యాన్లను చోరీ చేసిన ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు నాడు-నేడు కింద వచ్చిన 24 ఫ్యాన్లు రెండు గ్యాస్ సిల్లిండర్లను స్కూల్‌లో భద్రపరిచారు. గత నెల 5న వీటిని చోరీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బసివిరెడిపల్లె, చేకూరుఇండులకు చెందిన మురళి, గోపి, గంగాధరనెల్లూరు మండలం నందునూరు చెందిన జ్యోతి, తిరుపతి చెందిన నాగారాజు స్నేహితులు. వీరు మద్యం తాగుతుంటారు. ఈ నేపథ్యంలో వీరు స్కూల్ తలుపును పగలగొట్టి ఫ్యాన్లు, సిల్లిండర్లను చోరీ చేశారు. ఎస్ఐ కుళాయిప్ప సిబ్బందితో సోమవారం మెదవాడ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఆటోలో ఫ్యాన్లు, సిలిండర్లు తరలిస్తుండగా గుర్తించారు. బిల్లు లేకపోవడంతో పట్టుకొని విచారించారు. తాము స్కూలులో చోరీ చేసినట్లు అంగీకరించారు. 21 ఫ్యాన్లను , రెండు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ తరలించామని ఎస్ఐ తెలిపారు. రికవరీ చేసిన ఫ్యాన్‌లను పాఠశాలకు అప్పగించారు.

జిల్లా జట్టుకు రోల్‌బాల్ ఛాంపియన్‌షిప్



బంగారు పతకాన్ని కైవసం చేసుకున్న బాలురు జట్టు

చిత్తూరు క్రీడలు, జూలై30: రాష్ట్రస్థాయి రోల్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా జట్టు బంగారు పతకాన్ని సాధించింది. ఈ నెల 27, 28వ తేదిల్లో విశాఖలో పోటీలు నిర్వహించారు. జిల్లా క్రీడాకారులు అండర్-11 బాలురు విభాగంలో బంగారు పతకం, అండర్-11 బాలికల విభాగంలో వెండి, అండర్-17 బాలురు విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు టీచర్లకు గాయాలు



బోల్తా పడిన కారు

వెదురుకుప్పం, జూలై 30: రోడ్డు ప్రమాదంలో నలుగురు టీచర్లతో సహా మరొకరు గాయపడ్డారు. తిరుమలయ్యపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు మోహన్, నారాయణ రెడ్డి(ఫిజికల్ సైన్స్), వాణి(బయలజికల్ సైన్స్), వైదేహి (హిందీ)లతో పాటు జూనియర్ అసిస్టెంటు రామాంజనేయులు మంగళవారం ఉదయం తిరుపతి నుంచి కారులో బయలుదేరి వస్తున్నారు. పచ్చికాపల్లం-తిరుపతి రహదారిలో ఎర్రగుంటపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ఉన్న నలుగురు టీచర్లు, జూనియర్ అసిస్టెంట్ గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించినట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం

- కుప్పంలో రాజస్థాన్ రైతుల బృందం పర్యటన



ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న రాజస్థాన్ రైతులు

కుప్పం, జూలై 30: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అధ్యయనం చేయడానికి కుప్పం నియోజకవర్గంలో రాజస్థాన్ రైతుల బృందం పర్యటిస్తోంది. అక్కడి వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన నియోజకవర్గంలో అడుగుపెట్టిన ఈ బృందం ఆగస్టు 3వ తేదీదాకా ఇక్కడే ఉండి సంప్రదాయ వ్యవసాయ పంటలు, ఉద్యాన పంటలలో ప్రకృతి సాగు విధానాలను అధ్యయనం చేస్తుంది. ఇందులో భాగంగా మంగళవారం రామకుప్పం మండలంలోని విజలాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అంకిరెడ్లపల్లె గ్రామంలో మల్బరీతోపాటు 42 రకాల కూరగాయలు, పండ్ల మొక్కల నమూనాలను పరిశీలించి ఉపయోగాలు తెలుసుకున్నారు. ఏ గ్రేడ్, ఏటీఎం, పీఎండీఎస్ పొలాలను సందర్శించి ఆయా రకాల సాగు విధానాలను అధ్యయనం చేశారు. డ్రమ్ సీడ్ విధానాన్ని పరిశీలించారు. శాంతిపురం మండలం జంగాలపల్లె గ్రామంలో సత్యనారాయణ అనే రైతు పొలంలోనూ ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్ ద్వారా కూరగాయల సాగు విధానం అధ్యయనం చేశారు. కనమలదొడ్డి గ్రామంలో అమృతమ్మ అనే మహిళా రైతు పొలంలో ఉద్యాన పంటలు, ముత్తమ్మ అనే మహిళా రైతు పొలంలో అరటి పంటలో అంతర్ పంటలుగా కూరగాయలు, ఆకు కూరల సాగు విధానం పరిశీలించారు. కుప్పం మండలం సీగలపల్లె గ్రామంలో కృష్ణమూర్తి పొలంలో కూరగాయలు, వేరుశనగ సాగులో యూనివర్సల్ పద్ధతులను అధ్యయనం చేశారు. స్వయంసహాయ సంఘాల మహిళలు, క్షేత్రస్థాయి సిబ్బందితో ప్రకృతి వ్యవసాయం గురించి రాజస్థానం రైతుల బృందం చర్చించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీమ్ లీడర్ ఎల్.శ్రీనివాసులు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు వాసు, ఎన్ఎఫ్ఏ గురుప్రసాద్, వ్యవసాయ పరిశోధకురాలు పుష్ప, రాష్ట్రస్థాయి కల్పన, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదాలు జరక్కుండా జాగ్రత్తలు పాటించండి

తిరుపతి, రేణిగుంటలో డీఆర్ఎం తనిఖీలు





సీఆర్ఎస్‌లో కార్మికుల వినతులు పరిశీలిస్తున్న డీఆర్ఎం - తిరుపతిలో నూతన భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న విజయకుమార్

తిరుపతి(సెంట్రల్), జూలై 30: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ మేనేజరు (డీఆర్ఎం) విజయకుమార్ మంగళవారం తిరుపతి, రేణిగుంట రైల్వేస్టేషన్లతోపాటు రైల్వే కోచ్ రిపేరు షాపు (సీఆర్ఎస్)లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తొలి పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. సీఆర్ఎస్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికసంఘాల నేతలు తమ సమస్యలపై డీఆర్ఎంకు వినతి పత్రాలిచ్చారు. తర్వాత తిరుపతికి చేరుకుని నూతన భవన నిర్మాణాలను తనిఖీ చేశారు. వంద శాతం నాణ్యతతోపాటు పనుల్లో వేగం పెంచి, నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణాలపై డివిజన్, స్థానిక అధికారులతో రైల్వే సేఫ్టీపై సమీక్షించారు. యార్డులో రైలు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలిచ్చారు. అలాగే రేణిగుంట రైల్వేస్టేషన్ అధికారులతో సమీక్షించారు. సీఆర్ఎస్ మేనేజరు దేవసాయం, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, సీనియస్ స్కేల్ అధికారులు మనోజ్, శ్రావణ్ కుమార్, చంద్రశేఖర్, డిప్యూటీ సీఈ ఉపేంద్రకుమార్, ఎస్ఎంఆర్ కె.చిన్నప్పరెడ్డి, మాధవరావు, సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత లీలలపై కదిలిన యంత్రాంగం

రూ.కోటి స్థలం స్వాహాపై ఆర్సీపురం మండలంలో ఆర్డీవో పరిశీలన

నేటి విచారణకు డాక్యుమెంట్లు తేవాలని ఇరువర్గాలకు, అధికారులకు ఆదేశం



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో నిశాంత్ రెడ్డి

తిరుపతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండల పరిధిలోని భూమికి తిరుపతి రూరల్ మండలం తహసీల్దార్ ధ్రువీకరించినట్లు నకిలీ రికార్డు తయారైన వ్యవహారంపై రెవెన్యూ యంత్రాంగంలో కదలిక వచ్చింది. 'వైసీపీ నేత లీలలు' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించారు. స్థల వివాదానికి సంబంధించిన నివేదిక సమర్పించాలని ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని ఆదేశించారు. దాంతో మంగళవారం ఆర్డీవో.. రామచంద్రాపురం మండలం సి.రామాపురంలోని సర్వే నెంబరు 73/3 భూమిని పరిశీలించారు. బాధితుడు కె.పురుషోత్తమ రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆర్సీపురం మండలంలో ఉన్న తన భూమిలోని 10 సెంట్లను తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ ఇచ్చినట్టు నకిలీ 1-బీ, అడంగల్‌ను ప్రైవేట్ మీ-సేవ లేదా ఇంటర్నెట్ సెంటర్లో సృష్టించారన్నారు. దీనికి ఆర్సీపురం, రూరల్ మండలాల ఉద్యోగులు కుమ్మక్కయ్యారని ఆయన ఆరోపించారు. అనంతరం ఆ భూమిని డిల్లీరాణి (భర్త వైసీపీ నేత భానుకుమార్ రెడ్డి) పేరున డాక్యుమెంట్ నెంబరుగా (2282/2022)గా రిజిస్టర్ చేశారని, తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో పూర్తిస్థాయి డాక్యుమెంట్లను బుధవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగే విచారణకు తేవాలని ఇరువర్గాలతోపాటు అక్కడి రెవెన్యూ అధికారులను ఆర్డీవో ఆదేశించారు.

డొనేషన్లు సంపాదించడమే టీటీడీ పని కాదు

టీటీడీ మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం



తిరుమల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): 'డొనేషన్లు సంపాదించడమే టీటీడీ పని కాదు. ఈ విషయాన్ని నేను చాలాసార్లు చెబుతూ వచ్చా. ఆ కార్యాన్ని స్వామి చూసుకుంటాడు. వచ్చిన దాంతో భక్తులకు ఎలా సేవలందించాలి, సంప్రదాయాలను ఎలా నిలబెట్టాలి, స్వామి ఉత్సవాలను ఎంత చక్కగా నిర్వహించాలి, ఇతర ప్రాంతాలకు స్వామి వైభవాన్ని ఎలా విస్తరింపజేయాలి అనే అంశాలపై టీటీడీ ఈవో, అదనపు ఈవో దృష్టిసారించాలి' అని టీటీడీ మాజీ ఈవో, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరూ స్వామికి చక్కని కైంకర్యాలు, భక్తులకు సేవలందించడంలో జాగ్రత్తగా వ్యవహరించాలని మనవి చేసుకుంటున్నానన్నారు. ప్రభుత్వ పక్షాన మరిన్ని సేవలు అందాల్సిన అవసరముందన్నారు. ధర్మప్రచారానికి ప్రధాన వేదిక టీటీడీ కావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఈవోను సోమవారం కలిశానన్నారు. అలాగే అదనపు ఈవోను కూడా కలిసేందుకు ఉత్సాహంగా ఉన్నట్టు చెప్పారు. భక్తులకు ఎలాంటి సేవలందించాలనే అంశాలపై చక్కని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అధికారులు ధర్మమార్గంలో నడవడమే కాకుండా భక్తులందరినీ కూడా తీసుకెళ్లే ప్రయత్నం చేయాలన్నారు. అధికారులు కలిసికట్టుగా పని చేస్తే అనేక సేవలు భక్తులకు అందుతాయన్నారు. కొత్తగా వచ్చిన అధికారులకు మంచి అనుభవం ఉందని, బాగా చేస్తారనే నమ్మకం తనకుందన్నారు. పలువురు పండితులు రాసిన అనేక గ్రంథాలు టీటీడీ వద్ద వున్నాయని, వాటిని అనేక భాషల్లో ముద్రించి సరసమైన ధరకు విక్రయించాల్సిన అవసరముందన్నారు. శ్రీవారిమెట్టు మార్గం ద్వారా కాలినడకన తిరుమలకు వచ్చి వరాహస్వామిని, శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేశ ప్రజలందరికీ స్వామి ఆశీస్సులుండాలని ప్రార్థించానన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిత్తూరు బుడతడు



గుర్తింపు పత్రం, శరణ్‌తో తల్లిదండ్రులు

చిత్తూరు సిటీ, జూలై30: ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చిత్తూరు బాలుడు శరణ్ గొరజాల స్థానం సంపాదించాడు. కొంగారెడ్డి పల్లెకు చెందిన బాలుని తల్లిదండ్రులు స్వరూప్, ప్రియాంక మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఈ విషయం తెలిపారు. శరణ్ 21 నెలల వయసులో 28 సెకండ్లలో 50 మీటర్ల పరుగు పూర్తిచేసి గత రికార్డును అధిగమించాడన్నారు. ఈ వీడియోను తాము రికార్డ్‌చేసి ఇంటర్నేషనల్ బుక్‌ఆఫ్ రికార్డ్‌కు పంపించి దరఖాస్తు చేశామన్నారు. ఆ సంస్థ పరిశీలించి తమ కుమారునికి అవార్డు ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు.

తహసీల్దార్ల పోస్టింగ్స్‌పై సర్కారు కొత్త నిబంధనలు

ఎన్నికల ముందు పనిచేసిన మండలం, సొంత రెవెన్యూ డివిజన్, నియోజకవర్గంలో ఇవ్వరు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 30: ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి సొంత జిల్లాకు వచ్చే 42 మంది తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇచ్చే విషయమై సర్కారు కొత్త నిబంధనలు విధించింది. ఎన్నికల ముందు పనిచేసిన మండలం, సొంత రెవెన్యూ డివిజన్, నియోజకవర్గ పరిధిలో పోస్టింగ్ ఇవ్వకూడదని నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను మంగళవారం రాత్రి అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపింది. ఇందుకోసం నెల్లూరు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో కమిటీ వేసింది. ఈ కమిటీ నిర్ణయం మేరకు పోస్టింగ్స్ ఉంటాయి. ఈ లెక్కన చూస్తే చాలామంది తహసీల్దార్లు పక్క జిల్లాకు వెళ్లే పరిస్థితి కనబడుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీతో అంటకాగిన తహసీల్దార్ల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయ్యింది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.48 కోట్లు

తిరుమల,జూలై30(ఆంధ్రజ్యోతి):తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.48 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 65,874 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,782 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమల వీజీవోగా రాంకుమార్

తిరుపతికి సురేంద్ర



తిరుపతి(నేరవిభాగం), జూలై 30: తిరుమల విజిలెన్సు అండ్ సెక్యూరిటీ అధికారి (వీజీవో)గా ఎన్‌టీవీ రాంకుమార్‌ను ప్రభుత్వం నియమించింది. అక్కడ పనిచేస్తున్న గిరిధర్‌ను మాతృసంస్థ పోలీసు శాఖకు బదిలీ చేసింది. అలాగే తిరుపతి వీజీవోగా ఎ.సురేంద్రను నియమించింది. ఇక్కడ దీర్ఘకాలంగా వీజీవోగా పనిచేస్తున్న బాలిరెడ్డిని మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని మంగళవారం రాత్రి ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వస్తాయనీ తెలిపింది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

తొలిరోజే పెన్షన్ల పంపిణీ పూర్తి కావాలి


మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, జూలై 30: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 12 సచివాలయాలలో మొదటి రోజైన ఆగస్టు 1వ తేదీనే 99.9 శాతం పెన్షన్ల పంపిణీ ప్రక్రియ పూర్తి కావాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. మండల సచివాలయంలోని సమావేశపు హాలులో మంగళవారం ఆయన అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మున్సిపల్, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సామాజిక భద్రతా పెన్షన్లు 5097 మందికి పంపిణీ చేయాల్సి ఉన్నదన్నారు. ఆగస్టు 1వ తేదీన నిర్దేశిత సిబ్బంది తమకు కేటాయించిన పెన్షన్ల పంపిణీని దాదాపు పూర్తిచేయాలన్నారు. ఒకటీ అరా మిగిలితే మరుసటి రోజున లబ్ధిదారులకు అందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో, సీడీపీవోతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆవులకుప్పం పాఠశాలలో శిక్షా సప్తాహ్



రామకుప్పం, జూలై 30: మండలంలోని ఆవులకుప్పం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు వెంకటాచలం, టీడీపీ నాయకులు వెంకటేశ్‌లు ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం చేట్టిన పథకాలను, అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

పుంగనూరు రూరల్, జూలై30: స్థానిక నగిరివీధిలో వెలసిన సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. మంగళవారం ఆడికృత్తిక సందర్భంగా స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఆలయాల్లో కొనసాగిన ఆడికృత్తిక పూజలు


విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

రామకుప్పం, జూలై 30: మండలంలోని సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో మంగళవారం కూడా ఆడికృత్తిక పూజలు కొనసాగాయి. మంగళవారం కావడం, ఆడికృత్తిక గడియలు మధ్యాహ్నం 11:30గంటల వరకు ఉండటంతో రామకుప్పం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, పాలరేవుగడ్డ బాలమురుగన్ ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయాల్లో నిర్వాహకులు మూల మూర్తులకు ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. భక్తులు ఆలయాలకు చేరుకుని దైవదర్శనాలు చేసుకుని, అర్చనలు చేయించారు. పలువురు భక్తులు కావళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

అనర్హులు వైద్యం చేస్తే కఠిన చర్యలు: డీఎంఅండ్‌హెచ్‌వో


ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

గంగాధరనెల్లూరు, జూలై 30: మండల కేంద్రంలో పలు ఆర్‌ఎంపీ క్లినిక్‌లను మంగళవారం డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత లేనివారు క్లినిక్‌లు నడపరాదన్నారు. ఇంజెక్షన్లు, సెలైన్ వంటి వాటితో చికిత్స చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను తనిఖీ చేశారు. సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. అత్యవసర కేసులను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాలన్నారు. డాక్టర్ శిరిష, సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు మృతి

పూతలపట్టు, జూలై 30: ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడిన యువకుడు మృతి చెందాడు. వివరాలిలా..యాదమరి మండలం పుల్లయ్యగారిపల్లికి చెందిన లక్ష్మీపతి భార్య ద్రాక్షాయణి, కుమారుడు గౌతమ్ ఈనెల 28న పాకాల వెళ్ళేందుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. కొత్తపల్లి సమీపాన వీరి ద్విచక్ర వాహనాన్ని ఓ ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ద్రాక్షాయణి, గౌతమ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. గౌతమ్ పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం వేలూరు సీఎంసీకి తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. సీఐ సుదర్శన్ ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.


కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

గుడిపాల, జూలై 30: కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, మండల టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, మాజీ సర్పంచ్ పళణి అన్నారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏ శాఖను తీసుకున్నా అవినీతి జరిగిందే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. నిరుపేదల నుంచి భూములు లాక్కొని అక్రమంగా కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. దీంతో భూములను కూడా వదులుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు.

అన్నదాత సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎంపీ

చిత్తూరు సిటీ, జూలై 30: అన్నదాత సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ బిల్లు రద్దుకు అసెంబ్లీ ఆమోదం తెలిపిందన్నారు. ప్రభుత్వ రాజముద్రతో పాసుపుస్తకాల నమూనాను సీఎం విడుదల చేయడం హర్షణీయమని పేర్కొన్నారు.

రిటైరైన పోలీస్ అధికారులకు ఎస్పీ వీడ్కోలు



చిత్తూరు, జూలై 30: పోలీసు శాఖలో 40 ఏళ్లపాటు సుదీర్ఘ సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన వారు శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఎస్పీ మణికంఠ ఆకాంక్షించారు. రిటైరైన పుంగనూరు అర్బన్ స్టేషన్ ఎస్‌ఐ సత్యనారాయణ, ట్రాఫిక్ ఏఎస్‌ఐ సయ్యద్‌ఖాన్‌లను మంగళవారం అయన పోలీసు అతిథి గృహంలో సత్కరించారు. శాలువా కప్పి జ్ఞాపికలను అందించారు. ఏఎస్పీ అరీఫుల్లా, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ శ్రీ విష్ణు రఘువీర్, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఎంటీవో భాస్కర్, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్, పాల్గొన్నారు.

సమస్యలపై ఫిర్యాదు చేయండి

కుప్పం, జూలై 30: కుప్పం పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్యం, తాగునీరు, ఇతర సమస్యలు ఏవున్నా సరే ప్రజలు తనను కార్యాలయంలో నేరుగా సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేదా 9849901049 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదు అందు కున్న వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉదయం 5 నుంచే పింఛన్ల పంపిణీ

పలమనేరు, జూలై30 : పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో ఆగస్టు ఒకటో తేదీ ఉదయం 5 గంటల నుంచే పింఛన్లు సచివాలయ సిబ్బంది అందజేస్తారని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. లబ్ధిదారులు ఇళ్ల వద్దే ఉండి పెన్షన్లను అందుకోవాలని కోరారు.

డొక్కా సీతమ్మ భోజనం ప్రారంభం


సోమల పాఠశాలలో సహపంక్తి భోజనాల్లో ఎంఈవోలు

సోమల, జూలై 30: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం డొక్కా సీతమ్మ బడి భోజనం, శుభదిన్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు దాతలు అదనపు విందు భోజనం, స్వీట్లు అందజేశారు. సోమల హెచ్‌ఎం యల్లయ్య విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. పెద్దఉప్పరపల్లె హైస్కూల్లో ఉపాధ్యాయుడు విజయ్ తన కుమార్తె సాయిదీక్షిత జన్మదినం సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు, నోటు పుస్తకాలు అందజేశారు. ఎంఈవోలు శ్రీరాములు, శివరత్నలు హెచ్‌ఎం హరినాథ్ పీడీ కరుణానిధి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జనసేన సభ్యత్వ నమోదు

సోమల, జూలై 30: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు నాలుగో విడత సోమలలో ఆ పార్టీ మండల ధ్యక్షుడు నాగభూషణం రాయల్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన సాగుతోం దన్నారు. పార్టీ అభిమానులు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు చేసుకుంటు న్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో మురళి, పోకల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆడికృత్తిక ఉత్సవాలు



బైరెడ్డిపల్లె, జూలై 30 : మండలంలోని నెల్లిపట్ల దేవరకొండపై వెలసిన సుబ్రమణ్యస్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. అర్చకులు స్వామివారికి విశేషాలంకరణ చేసి శాస్త్రోక్తంగా కల్యా ణోత్సవం జరిపించారు. దీపోత్సవం, ఊంజల్‌సేవ నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ● తీర్థం-కొత్తపల్లె వద్ద కాళభైరేశ్వరస్వామి సన్నిధిలోవున్న సుబ్రమణ్యస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. పలువురు భక్తులు కావళ్లు సమర్పించారు.

పాఠశాలల్లో సామూహిక భోజనం


సామూహిక భోజనం చేస్తున్న బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పలమనేరు, జూలై30: ప్రభుత్వ ఆదేశాల మేరకు శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మంగళ వారం మండలంలోని అన్నిపాఠశాలల్లో సామూహిక భోజన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఎంఈఓ లీలారాణి, హెచ్‌ఎం లత, విద్యార్థులు పాల్గొన్నారు. పెంగరగుంట పాఠశాలలో ఎంఈఓ బాలసుందరం సామూహిక భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



బైరెడ్డిపల్లె, జూలై 30 : మండలంలోని లక్కనపల్లె గ్రామంలో మంగళ వారం గ్రామదేవతైన గంగరాతివద్ద గ్రామస్తులు వర్షం కోసం ప్రత్యేకపూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో చల్లగా ఉండేలా దీవించాలని వేడుకున్నారు. మహిళలు గంగరాతికి జలాభిషేకం చేశారు. కర్పూర హారతులిచ్చారు.

హరోహర నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

కల్లూరు, జూలై 30: పులిచెర్ల మండలం రామిరెడ్డిగారిపల్లి పంచాయతీ యలకబైలులో వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆడికృత్తిక వేడుకల సందర్భంగా ఉదయం నుంచి ఆలయానికి పుష్పకావళ్లతో భక్తులు తరలివచ్చారు. అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. గ్రామాల్లో కావళ్లకు పూజలు నిర్వహించి పురవీదుల్లో ఊరేగించారు. హరోంహర నామస్మరణలతో పల్లెలు మార్మోగాయి. ● దేవళంపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆడి కృత్తికను పురస్కరించుకొని స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు.


యలకబైలులో భక్తులకు దర్శనమిస్తున్న సుబ్రమణ్యేశ్వరుడు, పాళెంజూపల్లి పురవీధుల్లో కావళ్లను ఊరేగిస్తున్న భక్తులు

గృహనిర్మాణ పనులు పూర్తిచేయండి


ఏఎంసీ మార్కెట్ యార్డు సమీప హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న పీడీ పద్మనాభం

సోమల, జూలై 30: ప్రభుత్వ లేఅవుట్‌లో అర్థాంతరంగా ఆగిన ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ పద్మనాభం తెలిపారు. మంగళవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఆయన రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెండింగ్ బిల్లులు, ఆన్‌లైన్‌లో నమోదు వివరాలు పరిశీలించారు. పునాదులకే పరిమితమైన గృహాల లబ్ధిదారుల పరిస్థితిని ఆరా తీశారు. గృహ స్థలాలు అమ్మకాలు, కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సోమల, సూరయ్యగారిపల్లె తదితర లేఅవుట్లలో గృహనిర్మాణ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. హౌసింగ్ సిబ్బంది గణేష్, జావిద్, తరహానా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యేశ్వరుడి ఊరేగింపు


బంగారు తిరుత్తణిలో హోమాది కార్యక్రమాలు

సోమల, జూలై 30: సోమల సమీపంలోని బంగారు తిరుత్తణి కొండ ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా మంగళ వారం వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామివారిని ఊరేగించారు. వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ గణపతి, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఉద యం ఆలయంలో స్వామి వారికి పంచామృతాభి షేకం నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అర్చకులు పవన్‌స్వామి ఆధ్వర్యంలో హో మాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణ మంటపాన్ని సుందరంగా వివిధ పుష్పాలతో అలంకరించి స్వామి, అమ్మవార్లను మంటపంపై ఆసీనుల్ని చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పుష్ప కావళ్లు సమర్పించారు. ఆలయ ధర్మకర్త మేల్నాటి రఘుపతి పద్మావతమ్మ, పూల మురళీకృష్ణ, శ్రీదేవి, సుబ్రమణ్యం భక్తులకు అన్నదానం చేశారు.

కౌండిన్య కాలువ ఆక్రమణలు తొలగించాలి


కౌండిన్యనది ఆక్రమణలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, జూలై30: పట్టణ నడిబొడ్డున ప్రవహిస్తున్న కౌండిన్య నదీ కాలువ ఆక్రమణలు తొలగించాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం చౌడేపల్లె మార్గంలోని కౌండిన్య కాలువ ఆక్రమణలను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌండిన్య నదీ కాలువను వైసీపీ నాయకులు ఆక్రమించి విక్రయించారని ఆరోపించారు. అయినా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదన్నారు. కోట్లు విలువ చేసే స్థలాల ఆక్రమణలను తొలగించి కాల్వను వెడల్పు చేయాలన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మదన్‌మోహన్, అయాబ్ ఖాన్, రాజాజెట్టి, ప్రసాద్, పెద్దమఠం బాబు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, జూలై 30: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మెప్మా సిబ్బందిని ఆదేశించారు. ఆయన మంగళ వారం మెప్మా సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఇళ్లలోని చెత్తను ఎక్కడపడితే అక్కడ వీధుల్లో పడేయరాదన్నారు. ఇలా పడేయడంవల్ల పరిసరాల శుభ్రత లోపిస్తుందన్నారు. ఫలితంగా దోమలు వృద్ధి చెంది, అంటు వ్యాధులు ప్రబలుతాయని హెచ్చరించారు. ప్రజలు చెత్తను ఇళ్ల వద్దనే చెత్తబుట్టల్లో వేయాలన్నారు. ప్రతిరోజూ రాత్రిపూట రెండు ట్రాక్టర్లు, ఉదయం 5 గంటల నుంచి 11 ట్రాక్టర్లు, 9 ఈ-ఆటోలు, 3 పుష్ కార్ట్‌లతో మున్సిపాలిటీ చెత్తను సేకరిస్తోందని చెప్పారు. ఇళ్లవద్దకే చెత్త బండ్లు వస్తాయని, తమ ఇళ్ల వద్ద ఉంచిన చెత్తను ఆ బండ్లలో వేయాలని ప్రజలకు సూచించారు. పురపాలక సంఘాన్ని చెత్తరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రాంతాల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని మెప్మా సిబ్బందిని ఆయన ఆదేశించారు.

అనర్హుడిని తలారిగా నియమించడం తగదు: టీడీపీ

రామకుప్పం, జూలై 30: స్థానిక రెవిన్యూ కార్యాలయంలో అనధికారికంగా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని ఇటీవల తలారిగా నియమించారని దీనికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు మునస్వామి, ఆనందరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడాదిన్నరగా రెవిన్యూ కార్యాలయంలో తిష్ట వేసిన ఆ వ్యక్తిపై గతంలో వైసీపీ నేతలు పలు ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. రెవిన్యూ రికార్డుల్లో పేర్లు మార్పు, పెద్ద సంఖ్యలో అనర్హులకు ఇంటి స్థలాల పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయడంలో అధికారులతో కలిసి చేతివాటం ప్రదర్శించాడని ఆరోపిం చారు. అలాంటి వ్యక్తిని మళ్లీ తలారిగా నియమించడం తగదని పేర్కొన్నారు.. దీనిపై ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో బాటూ జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి అనర్హుడిని తలారిగా నియమించిన అధికారులపై చర్యలు తీసుకునేలా చూస్తామని స్పష్టం చేశారు. కాగా అతడి నియామకంపై ఇటీవల బదిలీపై వెళ్లిన తహసీల్దార్ శ్రీధర్‌ను వివరణ కోరగా ఆ వ్యక్తి నియామకం ప్రతిపాదనలు మాత్రమే ఉన్నాయని, తాను నియామకం చేపట్టలేదని వివరించారు.

ఉచిత కంటి పరీక్షలు



రొంపిచెర్ల, జూలై30: మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉచిత కంటి వైద్య చికిత్సలు నిర్వహించారు. వైద్యులు డాక్టరు పెంచులయ్య ఆధ్వర్యంలో 27 మందికి కంటి పరీక్షలు చేసి కంటి సమస్యలు ఉన్న వారికి అద్దాలు పంపిణీ చేశారు. అలాగే కుష్టు వ్యాధి నిర్ధారణ కోసం డీపీఎంవో దేవదాసు 89 మందికి పరీక్షలు చేసి ఇద్దరు వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు వినయ్, సీహెచ్‌వో కాంతమ్మ, హెచ్‌ఈ రాజేశ్వరి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు



రొంపిచెర్ల, జూలై30: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ శివాలయంలో వెలసిన సుబ్రమణ్య స్వామి ఆడికృత్తిక పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు చేశారు. పుష్ప కావళ్లు సమర్పించారు.

కన్నుల పండువగా కల్యాణోత్సవం



సదుం, జూలై 30: స్థానిక గార్గేయ నది ఒడ్డున కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆడికృత్తిక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఉభయ దారు లుగా మల్‌రెడ్డి, సునంద దంపతులు వ్యవహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు కృత్తిక కావిళ్లు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. చంద్రశేఖర రెడ్డి, పురుషోత్తమ రెడ్డి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

1వ తేదీన ఇంటివద్దకే పింఛన్లు

సదుం, జూలై 30: వచ్చే నెల ఒకటవ తేదీన లబ్ధిదారులందరికీ వారి ఇంటి వద్దే సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్ మంగళవారం తెలిపారు. వివిధ పనుల కోసం బయట ప్రాంతాలకు వెళ్లిన లబ్ధిదారులు ఒకటో తేదీన తమ ఇళ్ల వద్ద ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒకటవ తేదీనే వంద శాతం పంపిణీ పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


గ్రంథాలయాధికారిని సన్మానిస్తున్న ప్రముఖులు

పుంగనూరు రూరల్, జూలై30: నిరుద్యోగ యువతీ యువకులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టణ ప్రముఖులు వెంకటపతి, అయాబ్‌ఖాన్ కోరారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి తులసీనాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేశాద్రిప్రకాశ్, సలీమ్, పద్మావతమ్మ, హరి తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

పుంగనూరు, జూలై30: స్థానిక మున్సిపల్ సమావేశం బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీంబాషా తెలిపారు. సమావేశానికి మున్సిపల్ అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు. పట్టణ అభివృద్ధిపై చర్చించనున్నట్లు వివరించారు.

వీధి కుక్కలతో భయం..భయం



సదుం, జూలై 30: గ్రామవీధుల్లో వీధి కుక్కల వీరంగం ప్రజల్లో దడ పుట్టిస్తోంది. రాత్రి, పగలు తేడా లేకుండా పదుల సంఖ్యలో కుక్కలు నడివీధుల్లో తిరుగుతున్నాయి. చిన్నారులు రోడ్లపైకి వెళ్లాలంటే తల్లిదండ్రులు భయాం దోళనలు వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది స్పందించి కుక్కల నియం త్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విశ్రాంత హెచ్‌ఎం నాగమల్లయ్య మృతి

సోమల, జూలై 30: సోమలకు చెందిన విశ్రాంత హెచ్‌ఎం నాగమల్లయ్య మంగళవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు ఆయనకు నివాళులర్పించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న ఉద్యానశాఖ జిల్లా అధికారి మధుసూదన్‌రెడ్డి

రామకుప్పం, జూలై 30: ఉద్యాన శాఖ సూచించిన మేరకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాశాఖ జిల్లా అధికారి మధుసూధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రామకుప్పంలో నిర్వహించిన మామిడి రైతుల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. మామిడి కాయలు కోసిన వెంటనే కొమ్మలు కత్తిరింపులు చేపట్టాలన్నారు. కొమ్మకత్తరింపుల వలన కలిగే ప్రయోజనాలు, ఎరువుల వాడకం, దున్నకాలపై అవగాహన కల్పించారు. కొమ్మలు కత్తిరించన వెంటనే ఎరువులు వేసి నీటి తడులు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం పచ్చిరొట్ట పైరులు వేసి సెప్టెంబరు, అక్టోబరు మెదటి వారాల్లో పచ్చిరొట్ట ఎరువులు వేయాలన్నారు. అధికంగా రసాయన ఎరువుల వాడరాదన్నారు. శిబిరం అనంతరం దగ్గరలోని మామిడి తోటలో కొమ్మల కత్తిరింపును ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, తెలుగురైతు మండల అధ్యక్షుడు కొళ్లపల్లెబాబు మండల ఉద్యాన అధికారి డింపుప్రియ, ఆర్‌ఎస్‌కే అధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో కూడిన విద్య అభ్యసించాలి : గురజాల



విద్యార్థి మిత్ర కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు (సెంట్రల్), జూలై 30 : లక్ష్యంతో కూడిన విద్యను అభ్యసించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ఆయన అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ, సొంత నిధులతో ఈ కళాశాల భవనాన్ని ఐకాన్‌లా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇంటర్ సీఈసీ గ్రూపులో 966 మార్కులు సాధించిన నందినిని సన్మానించి మెమెంటో అందించారు. తమ ట్రస్టు ద్వారా రూ.5 లక్షలతో సీఏ చదవిస్తానని ఆమెకు హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థి మిత్ర కిట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఐఈవో సయ్యద్ మౌల, కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ మజీద్, ఒకేషనల్ ప్రిన్సిపాల్ మహేష్ కుమార్, నగర మాజీ మేయర్ కఠారి అనురాధ, టీడీపీ, బీజేపీ నాయకులు వైవీరాజేశ్వరీ, శ్రీనివాసులు, మోహన్‌నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఎమ్మెల్యే సహపంక్తి భోజనం



విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే మురళి

ఐరాల(కాణిపాకం), జూలై 30: ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తోందని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా ఆయన విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రణాళికతో ఉన్నతమైన విద్యను బోధించాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు,మాజీ సర్పంచ్ మధుసూదనరావు, మాజీ జడ్పీటీసీ లత, రైతు నాయకుడు గంగారపుహరిబాబు నాయుడు,ధనంజయనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు అందక ఉపాధి కూలీల ఆవేదన

పాలసముద్రం, జూలై 30: ఉపాధి హామీ పథకంలో పనిచేసే తమకు కొద్దిరోజులుగా కేంద్ర ప్రభుత్వం డబ్బులు జమచేయలేదని కూలీలు వాపోతున్నారు. మండలంలో సుమారు వెయ్యి మందికి పైగా పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికి సుమారు రూ.10వేలకు పైగా కూలీ బకాయి ఉంది. గత 11వారాలుగా కూలీ డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామనికూలీలు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని బకాయిలను విడుదల చేయాలని కోరుతున్నారు.

శ్రీహరిపురంలో శిక్షా సప్తాహ్ శుభదినం



విద్యార్థులకు భోజనంలో స్వీట్ల పంపిణీ

విజయపురం, జూలై 30: శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో మంగళవారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా శుభదిన్ నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థి చెంచురాజు ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు భోజనంలో స్వీట్లు పంచారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జ్ఞాన ప్రసాద్, ఏంఈవో హరిప్రసాద్‌వర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు: డీపీవో



పన్నూరు దళితవాడలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న డీపీవో లక్ష్మీ

విజయపురం, జూలై 30: మండలంలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచాలని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం పన్నూరు దళితవాడలో పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. మురుగునీరు నిలవకుండా చూడాలన్నారు. ఎంపీడీవో బ్రహ్మయ్య, ఈవోపీఆర్డీ బాబు, పంచాయతీ కార్యదర్శులు కానిక్యరాజ్, సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎంపీ

చిత్తూరు సిటీ, జూలై 30: అన్నదాత సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ బిల్లు రద్దుకు అసెంబ్లీ ఆమోదం తెలిపిందన్నారు. ప్రభుత్వ రాజముద్రతో పాసుపుస్తకాల నమూనాను సీఎం విడుదల చేయడం హర్షణీయమని పేర్కొన్నారు.

విద్యార్థుల మధ్యాహ్న భోజనం తనిఖీ



నగరి, జూలై 30: ఎం కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఎంఈవో నమఃశివాయం తనిఖీ చేశారు. బియ్యం, గుడ్లు, చిక్కి, టేస్ట్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. వంట గది పరిశుభ్రతను చూశారు. భోజన రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. భోజనం తినే విద్యార్థుల సంఖ్యను పెంచాలని ప్రధానోపాధ్యాయులు గీతాకుమారి సూచించారు.

విద్యార్థులకు విద్యాకిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే థామస్

కార్వేటినగరం, జూలై 30: స్థానిక ప్రభుత్వ హైస్కూలులో మంగళవారం విద్యార్థులను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటర్ విద్యకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇంటర్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజన పథకం వర్తించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. కార్యక్రమంలో డీఈవో దేవరాజులు, ఎంఈవో విజయ్‌కుమార్, జనసేన నాయకులు యుగంధర్, బీజేపీ నాయకులు యువరాజు, టీడీపీ నాయకులు చెంగల్‌రాయల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యస్వామి ఊరేగింపు



కార్వేటినగరం, జూలై 30 :సుబ్రమణ్యేశ్వరస్వామి ఆడికృత్తిక ఉత్సవాల అనంతరం మంగళవారం గ్రామ ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. కర్పూర నీరజనాలతో మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డీఎంపురం స్కూలులో సహపంక్తి భోజనం

కార్వేటినగరం, జూలై 30: శిక్ష సప్తాహ కార్యక్రమం ముగింపు సందర్భంగా డీఎం పురం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం సహపంక్తి భోజన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు,తల్లిదండ్రులతో కలిసి 225 మంది సహపంక్తి భోజనం చేశారు. స్థానిక దాతలు కార్యక్రమానికి సహకరించారు. హైస్కూల్ హెచ్‌ఎం కేశవులు, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రిటైరైన పోలీస్ అధికారులకు ఎస్పీ మణికంఠ వీడ్కోలు



చిత్తూరు, జూలై 30: పోలీసుశాఖలో 40 ఏళ్లపాటు సుదీర్ఘ సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన వారు శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఎస్పీ మణికంఠ ఆకాంక్షించారు. రిటైరైన పుంగనూరు అర్బన్ స్టేషన్ ఎస్ఐ సత్యనారాయణ, ట్రాఫిక్ ఏఎస్ఐ సయ్యద్‌ఖాన్‌లను మంగళవారం ఆయన పోలీసు అతిథి గృహంలో సత్కరించారు. శాలువా కప్పి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అరీఫుల్లా, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ శ్రీ విష్ణు రఘువీర్, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఎంటీవో భాస్కర్, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్, పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

పాలసముద్రం, జూలై 30: టీపీఎన్ఆర్ పురంలో సోమవారం రాత్రి తన ద్విచక్రవాహనాన్ని దుండగులు చోరీచేసుకుని వెళ్ళినట్లు గ్రామానికి చెందిన బాలాజీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన రామూర్తి రాజుకు చెందిన రెండు మేక పోతులను కూడా దుండగులు తీసుకునిపోయినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ భారతి కేసు నమోదు చేశారు.

రేపు స్టాండింగ్ కమిటీ ఎన్నిక

చిత్తూరు, జూలై 30: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యుల నియామకానికి ఆగస్టు 1న ఎన్నిక జరుగనుంది. గత కమిటీ పదవీ కాలం ఈనెల 21వ తేదీతో ముగిసింది. దీంతో కొత్త కమిటీ నియామకానికి అధికారులు ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రకటించారు. స్టాండింగ్ కమిటీలో ఐదుగురిని ఎన్నుకోవాల్సి ఉంది. ఎనిమిది మంది నామినేషన్ దాఖలు చేశారు. ఫలితంగా ఎన్నిక అనివార్యమైంది. 1న ఉదయం 10.30 గంటల నుంచి పోలింగ్ నిర్వహించి, అనంతరం ఫలితాన్ని ప్రకటిస్తారు.

ప్రమాదవశాత్తూ జారిపడి టీడీపీ నాయకుడి మృతి



హేమశేఖర్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

వెదురుకుప్పం, జూలై 30: పచ్చికాపల్లంకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బండి హేమశేఖర్‌రెడ్డి(55) మంగళవారం ఉదయం బాత్‌రూంలో కాలు జారిపడి మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. హేమశేఖర్‌రెడ్డి మండల తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన భౌతికకాయంపై పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

గుడిపాల, జూలై 30: కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, మండల టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, మాజీ సర్పంచ్ పళణి అన్నారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏ శాఖను తీసుకున్నా అవినీతి జరిగిందే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. నిరుపేదల నుంచి భూములు లాక్కొని అక్రమంగా కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. దీంతో భూములను కూడా వదులుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వంలో అందరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు.

గాయపడిన యువకుడు మృతి

పూతలపట్టు, జూలై 30: ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడిన యువకుడు మృతి చెందాడు. వివరాలిలా..యాదమరి మండలం పుల్లయ్యగారిపల్లికి చెందిన లక్ష్మీపతి భార్య ద్రాక్షాయణి, కుమారుడు గౌతమ్ ఈనెల 28న పాకాల వెళ్ళేందుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. కొత్తపల్లి సమీపాన వీరి ద్విచక్ర వాహనాన్ని ఓ ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ద్రాక్షాయణి, గౌతమ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. గౌతమ్ పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం వేలూరు సీఎంసీకి తరలిస్తుండగా దారిలో మృతిచెందాడు. సీఐ సుదర్శన్ ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



నింద్ర, జూలై 30: కొప్పేడు గ్రామ పంచాయితీలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అన్నై గౌరీ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పలువరికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు తంగరాజ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సంపూర్ణమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

అనర్హులు వైద్యం చేస్తే కఠిన చర్యలు:డీఎంఅండ్‌హెచ్‌వో



ఆర్‌ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

గంగాధరనెల్లూరు. జూలై 30: మండల కేంద్రంలో పలు ఆర్‌ఎంపీ క్లినిక్‌లను మంగళవారం డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత లేనివారు క్లినిక్‌లు నడపరాదన్నారు. ఇంజెక్షన్లు, సెలైన్ వంటి వాటితో చికిత్స చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను తనిఖీ చేశారు. సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. అత్యవసర కేసులను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాలన్నారు. డాక్టర్ శిరిష, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో ఆడికృత్తిక ఉత్సవం





కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్ల ఊరేగింపు - కన్నికల కొండ ఆలయం వద్ద భక్తుల సందోహం

చిత్తూరు కల్చరల్, జూలై 30: స్థానిక కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వరాలయంలో వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామికి మంగళవారం ఆడికృత్తిక పర్వదిన పూజలు ఘనంగా నిర్వహించారు. కాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయ ఈవో తిమ్మారెడ్డి, అర్చకులు శివాచార్య గురుకుల్‌లు స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజలు, విశేష అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కాళభైరవ ట్రస్టు వ్యవస్థాపకుడు వెంకటేషన్ ఆధ్వర్యంలో ఉత్సవ మూలవర్లను ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. స్వామి దర్శనం కల్పించారు.

తవణంపల్లె: ఆడికృత్తిక వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. అరగొండ స్వయం భువనేశ్వర, తవణంపల్లె సుబ్రమణ్య స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అరగొండ ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కావళ్లతో వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.



శ్రీరంగరాజపురం నుంచి కావిళ్లతో వెలుతున్న భక్తులు

శ్రీరంగరాజపురం: మండలంలోని 49. కొత్తపల్లిమిట్ట, పలు గ్రామాల్లో భక్తులు కావళ్లతో తిరుత్తణి, ఎట్టేరి, కార్వేటీనగరం సుబ్రమణ్యస్వామి ఆలయానికి వెళ్లారు. ఉదయం భక్తులు కావళ్లకు అభిషేకం, పూజలు చేసి పుష్పాలతో కావళ్లకు అలంకరణ చేసి ఆలయానికి తరలి వెళ్లారు.

పెనుమూరు: కన్నికల కొండపైవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయానికి మంగళవారం పెద్ద ఎత్తున వచ్చారు. మొక్కులను తీర్చుకున్నారు. ఉదయం నుండి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శన బాగ్యం కల్పించారు. ఈశ్వర్‌ప్రసాద్ దంపతులు ప్రసాదాలు వితరణ చేశారు.

భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి

● వైసీపీ నేతలతో కలిసి రికార్డుల తారుమారు



మాట్లాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు

చిత్తూరు(సిటీ), జూలై 30: భూమి కబ్జా చేయడమే కాకుండా దాడి చేసి తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని యాదమరి మండలం 184 గొల్లపల్లె పేరకూరుకు చెందిన వెంకటస్వామి, వరదరాజులు, చంద్రయ్యనాయుడు, కుటుంబ సభ్యులు కోరారు. మంగళవారం వారు చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. దాసరాపల్లె పంచాయతీలో తమకు 1.48 ఎకరాల వంతున భూమి ఉందన్నారు. తరువాత చంద్రయ్యనాయుడు భాగానికి వచ్చిన 1.48 ఎకరాలను పార్వతి, పరమేశ్వరిలు తీసుకుని 2004లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. వైసీపీ నేతలతో కలిసి పేరకూరుకు చెందిన శేఖర్, లోకేష్‌లు తమ ఆధీనంలోని భూమికి సంబంధించి సర్వే నెంబర్లను తారుమారు చేసి కబ్జా చేశారన్నారు. సర్వేయర్, వీఆర్వో సహకరించారన్నారు. మండల అధికారులకు, జేసీకి ఫిర్యాదు చేశామన్నారు. రెండు రోజుల క్రితం తమపై దౌర్జన్యాలకు పాల్పడ్డారన్నారు. ఫిర్యాదు చేసినా కబ్జా చేసిన వారికే పోలీసులు వత్తాసు పలుకుతున్నారన్నారు. పూర్తి స్థాయిలో విచారించి న్యాయం చేయాలని కోరారు.

5వ తేదీ వరకు జనసేన పార్టీ సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న జనసేన నేత ఆరణి కవిత

చిత్తూరు సిటీ, జూలై30: ఆగస్టు 5వ తేదీ వరకు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రక్రియ పొడిగిస్తున్నట్లు ఆ పార్టీ పీఏసీ రాష్ట్ర కార్యదర్శి ఆరణి కవిత చెప్పారు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ ప్రజల విన్నపం మేరకు... జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆగస్టు 5 వరకు పొడిగించారన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుకు ఫోటో, రూ.500 నగదు, ఆధార్ కార్డు నామినీ పేరును పొందుపరిచి వివరాలు ఇవ్వాలని చెప్పారు. పార్టీ నేతలు పూర్ణ, రవి, కిషోర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి రూ.1.75 కోట్లు మంజూరు



నాయకులతో సమీక్షిస్తున్న మురళీమోహన్

బంగారుపాళ్యం, జూలై 30: పల్లె ప్రగతికి టీడీపీ మొదటి ప్రాధాన్యతనిస్తుందని నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ చెప్పారు. మంగళవారం మండల పార్టీ కార్యాలయంలో ఆయన నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి ఎన్ఆర్‌జీఎస్, జడ్పీ నిధుల కింద రూ.1.75 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. తొలి ప్రాధాన్యతగా ఈ నిధులతో రాగిమానిపెంట దళితవాడలో వాటర్ ట్యాంకు, ముంగరమడుగులో బ్రిడ్జి, దేగలబండ నుండి జమ్మునేరేడిపల్లికి బీటీ రోడ్డు, తగ్గువారిపల్లె పంచాయతీ ఆండారెడ్డిపల్లి వద్ద మురుగునీటి మరమ్మతు పనులు చేపడతామన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు తమకు పింఛన్ రావడం లేదని మొరపెట్టుకున్నారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, నాయకులు ధరణి, కోకా ప్రకాష్ నాయుడు, జనార్దన్ గౌడ్, లోకనాథం నాయుడు, రమేష్, శివ, శ్రీనివాసులు, సూరి, మాధవ నాయుడు పాల్గొన్నారు.

పేదల సొంత ఇంటి కల నిజం చేస్తున్న ప్రభుత్వం: టీడీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్ రాజన్

చిత్తూరు సిటీ, జూలై 30: పేదల సొంత ఇంటి కలను సీఎం చంద్రబాబు నిజం చేస్తున్నారని టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ చెప్పారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల భూమి ఇచ్చి ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం రూ.4 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్‌తో ఉద్యోగాలు కల్పిస్తుందని చెప్పారు. నేతలు మోహన్‌రాజ్, మేషాక్, కృష్ణమూర్తి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

పూతలపట్టు, జూలై 30: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి కోరారు. మంగళవారం ఆమె పోటుకనుమ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలన్నారు. అనంతరం గొడుగుచింత, పోటుకనుమ గ్రామాల్లోని పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యదర్శులకు సూచనలిచ్చారు.

ఎమ్మెల్యేకు చేనేత కార్మికుల సన్మానం

పెనుమూరు, జూలై 30: చేనేత కార్మికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే థామస్ అన్నారు. మంగళవారం గొడుగుమానుపల్లిలో ఎమ్మెల్యే థామస్‌ను చేనేత కార్మికులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి చేనేత క్లస్టర్‌కు వచ్చిన రూ.60 లక్షల వినియోగానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, చిట్టిబాబునాయుడు, హరిబాబునాయుడు, కార్జాల అరుణ, భాస్కర్, మనోహర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నాధముని తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం బంగారమ్మకు విశేష పూజలు



కార్వేటినగరం, జూలై 30: స్థానిక గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పార్కు పనుల వేగవంతం: కమిషనర్



ఆట వస్తువులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, జూలై 30: మిట్టూరు మునస్వామినాయుడు పార్కులో నిర్దేశించిన పనులను వేగవంతం చేయాలని కమిషనర్ అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె పార్కును పరిశీలించారు.ఆట వస్తువులు, ప్రహరీ, వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. ప్రహరీకి రంగులు వేయాలని, ఆట వస్తువులకు మరమ్మతులు చేసి వినియోగానికి సిద్ధం చేయాలన్నారు. షటిల్ కోర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీఈ రమణ, ఏఈ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమరనాథరెడ్డి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ కార్యవర్గం ఎన్నిక





రవి- ఏసుపాదం

విజయపురం, జూలై 30: మండల కేంద్రంలో మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి కోదండయ్య అధ్యక్షతన 11 మందితో ఏఐటీయూసీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా ఏసుపాదం, గౌరవ అధ్యక్షులుగా సుజాత, కార్యవర్గ సభ్యులుగా పరిమళ, లక్ష్మీ, భువన, షీబా, మునిలక్ష్మి, ఏకుమలై, సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా శుభ్‌దిన్ భోజన్

నగరి, జూలై 30: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏకాంబరకుప్పంలో శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేకే నమఃశివాయం పాఠశాలలో భోజనం సమకూర్చారు. ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయం, ఎమ్మార్సీ ప్రధానోపాధ్యాయులు వీఎస్ నమఃశివాయం, పీఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మునెప్పనాయుడు కండ్రిగ పాఠశాలలో గోవర్ధన్ నాయుడు దాతగా వ్యవహరించారు.

కిటకిటలాడిన దేశమ్మ దేవాలయం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నగరి, జూలై 30: నేత్రప్రదాయణి దేశమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయం ముందున్న అమ్మవారి పాదుకల వద్ద పొంగళ్లు ఉంచి పూజలు చేశారు. అంబలి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. పలువురు తలనీలాలు సమర్పించుకున్నారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి రామచంద్రారెడ్డి, తాత్కాలిక కమిటీ సభ్యులు మురళి, వీకేఎస్ వాసు మదన్‌కుమార్, వెంకటాచలం, సుబ్బరాయులు, నాయకులు కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు, గుణశేఖర్ పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

వెదురుకుప్పం, జూలై 30: దామరకుప్పంలో మంగళవారం గంగమ్మను ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఇనాంకొత్తూరు గ్రామ సర్పంచ్ కఠారి మమత మోహన్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికి శాలువ కప్పి సత్కరించారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు, కూటమి నాయకులు హాజరయ్యారు.

● గంగమ్మ సేవలో బీజేపీ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు బోడిరెడ్డి హనుమంతరెడ్డి, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఎస్.సుజాత, పార్టీ మండల మాజీ అధ్యక్షులు ఎస్.ప్రభాకరరాజు తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

వెదురుకుప్పం, జూలై 30: చవనపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈవో దామోదరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనం రుచి చూసి, విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు.